నేడు స్వాతంత్ర సమరయోధుడు పిచ్చిరెడ్డి విగ్రహావిష్కరణ

నాగారానికి మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే కిశోర్

నాగారం, అక్టోబర్ 24 : స్వతంత్ర్య సమర యోధుడు, నాగారం గ్రామ మొదటి సర్పంచ్ గుంటకండ్ల పిచ్చిరెడ్డి విగ్రహాన్ని బుధవారం ఆవిష్కరించనున్నారు. నాగారం బంగ్లాలో ఏర్పాట్లను మంత్రి జగదీశ్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రిని సర్పంచ్ కుంభం కరుణాకర్ శాలువాతో సత్కరించారు. గ్రామానికి చెందిన కడారు ప్రశాంత్‌రెడ్డి ఇటీవల కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపిక కాగా మంత్రి అభినందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ఉపాధ్యక్షుడు దోమల బాలమల్లు, రైతు బంధు సమితి మండల కో-ఆర్డినేటర్ గుండగాని అంబయ్య, గ్రామ శాఖ అధ్యక్షుడు కన్నెబోయిన మల్లేశ్, చిప్పలపల్లి సోమయ్య, ముకుందరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, కుమార్, శ్రీను, వెంకన్న ఉన్నారు.

నాగారం మండల పర్యటనకు మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ బుధవారం వస్తున్నట్లు బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కల్లెట్లపల్లి ఉప్పలయ్య మంగళవారం ఒక ప్రకటనలతో తెలిపారు. నాగారం బంగ్లలో ఏర్పాటు చేసిన స్వాతంత్ర్య సమరయోధుడు గుంటకండ్ల పిచ్చిరెడ్డి విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించనున్నట్లు వెల్లడించారు. అలాగే నర్సింహులగూడెం, పేరబోయినగూడెం గ్రామంలో ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

అభివృద్ధికి అండగా బీఆర్ఎస్‌లో చేరికలు

- పార్టీ మండల అధ్యక్షుడు రమేశ్

పాటిమట్లలో యువకులకు గులాబీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఆ పార్టీ మండలాధ్యక్షుడు రమేశ్

మోత్కూరు, అక్టోబర్ 24 : ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమానికి అండగా ఉండేందుకు వివిధ పార్టీల నుంచి నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు ఆ పార్టీ మండలాధ్యక్షుడు పొన్నెబోయిన రమేశ్ తెలిపారు. మంగళవారం మండలంలోని పాటిమట్లలో వివిధ పార్టీలకు చెందిన యువకులు నార్మాక్స్ డైరెక్టర్ రచ్చల క్ష్మీనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. తుంగతుర్తిలో ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్‌ను మరోమారు ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లేశ్, గ్రామ శాఖ అధ్యక్షుడు బండి రాజు, మండల ప్రధాన కార్యదర్శి గిరగాని శ్రీను, నాయకులు యాదగిరి, సలీం, రాజేశ్ పాల్గొన్నారు.

కేంద్ర బలగాల సిబ్బందికి వైద్య పరీక్షలు

తిరుమలగిరి పీహెచ్‌సీలో కేంద్ర బలగాల సిబ్బందికి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

తిరుమలగిరి, అక్టోబర్ 24 : తిరుమలగిరి ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఎన్నికల నిర్వహణలో ఉన్న కేంద్ర బలగాల సిబ్బందికి సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్ వంటి జనరల్ పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్ఓ బిచ్చూనాయక్, ఎస్ఐ ప్రసాద్, సూపర్‌వైజర్ రామచంద్రు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కొడుకుతో కలిసి భర్తను చంపిన భార్య

- ఆస్తి తగాదాలే కారణం?

తుంగతుర్తి, అక్టోబర్ 24 : కొడుకుతో కలిసి కట్టుకున్న భర్తను భార్య కడతేర్చింది. ఈ ఘటన మండలంలోని రామన్నగూడెం తండాలో సోమవారం రాత్రి జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన భూక్య హర్జ(49), కైక దంపతులు. వీరికి ఓ కుమారుడు సురేశ్. భర్తతో మనస్పర్థల కారణంగా కొడుకుతో కలిసి కైక కొంత కాలంగా హైదరాబాద్‌లో నివసిస్తున్నది. తల్లీకొడుకులు ఆస్తి విషయమై పలుమారు హర్జతో గొడవపడగా మందలించినట్లు సమాచారం. దసరా పండుగ సందర్భంగా తల్లీకొడుకు తండాకు వచ్చారు. సోమవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న హర్జపై తల్లీకొడుకు కత్తిపీటతో దాడి చేసి చంపారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

ఇరువర్గాల ఘర్షణలో పలువురికి గాయాలు

ఆత్మకూర్.ఎస్, అక్టోబర్ 24 : ఇరు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో పలువురు వ్యక్తులు గాయపడ్డ ఘటన మండలంలోని మక్తాకొత్తగూడెం గ్రామంలో సోమవారం రాత్రి జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో కొల్లా అంజయ్య, ఉపేందర్ ఇద్దరి మధ్య పండుగ శుభాకాంక్షలు తెలుపుకునే క్రమంలో స్వల్ప వివాదం చోటుచేసుకున్నది. ఇది కాస్తా పెద్దదై ఇరువర్గాల మధ్య ఘర్షణకు దారి తీసింది. ఈ దాడిలో పలువురి తలలు, చేతులకు తీవ్రగాయాలయ్యాయి. ఒకరిపై ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

తిరుమలగిరిలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

తుంగతుర్తి : జమ్మి పూజల్లో పాల్గొన్న ప్రజలు

ఘనంగా విజయదశమి వేడుకలు

తిరుమలగిరి, అక్టోబర్ 24 : మండలంలో విజయదశమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో జమ్మి పూజలు నిర్వహించి పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రజలు పాలపిట్టను దర్శించుకుని జమ్మి ఆకును బంధు మిత్రులకు ఇచ్చి వేడుకలను ఆందనంగా జరుపుకున్నారు.

తుంగతుర్తి : మండల వ్యాప్తంగా దసర వేడుకలను ఘనంగా నిర్వహించారు. జడ్పీ చైర్‌పర్సన్ గుజ్జా దీపికాయుగేంధర్‌రావు, తాటికొండ సీతయ్య, గుడిపాటి సైదులు, గుండగాని కవితారాములు గౌడ్, శ్రీశైలంయాదవ్, మాజీ మార్కెట్ చైర్మన్ పులుసు యాదగిరి, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు నల్లు రాంచంద్రారెడ్డి, సర్పంచ్ సంకినేని రవీందర్‌రావు పాల్గొన్నారు

మోత్కూరులో నిర్వహించి పూజలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ తీపిరెడ్డి సావిత్రీమేఘారెడ్డి

మోత్కూరు, అక్టోబర్ 24 : దసరా పండుగను మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. వేడుకల్లో మున్సిపల్ చైర్ పర్సన్ తీపిరెడ్డి సావిత్రీమేఘారెడ్డి, వైస్ చైర్మన్ బొల్లేపల్లి వెంకటయ్య, కల్వల సోదరులు, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు. అలాగే అడ్డగూడూరులో నిర్వహించిన వేడుకల్లో సర్పంచ్ బాలెంల త్రివేణీదుర్గయ్య పూజలు నిర్వహించారు.

నాగారం : డి.కొత్తపల్లి గ్రామంలో జమ్మి పూజకు వెళ్తున్న సర్పంచ్ నరసింహారెడ్డి

నూతనకల్ మండల కేంద్రంలో ఆయుధ పూజల్లో పాల్గొన్న పోలీసులు

మునగాలలో శమీ పూజలో పాల్గొన్న గ్రామస్తులు

అర్వపల్లి : బొల్లంపల్లిలో విజయదశమి వేడుకల్లో పాల్గొన్న ప్రజలు

శూన్యపహాడ్ చెక్‌డ్యాం వద్ద గుర్తు తెలియని మృతదేహం

పాలకవీడు, అక్టోబర్ 24 : మండలంలోని శూన్యపహాడ్ గ్రామంలో మూసీ నదిపై నిర్మించిన చెక్‌డ్యాం వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృత దేహం లభ్యమైనట్లు ఎస్ఐ లింగయ్య తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చెక్‌డ్యాం వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృత దేహం ఉన్నట్లు స్థానికులు అందించిన సమాచారం మేరకు వెళ్లి పరిశీలించినట్లు చెప్పారు. 25 నుంచి 35 సంవత్సరాల మధ్య వయసున్న వ్యక్తి మృతదేహం పడి ఉందని, సదరు వ్యక్తి సిమెంట్ కలర్ హాఫ్ టీషర్ట్, బ్లాక్ కలర్ పాయింట్ ధరించి ఉన్నట్లు పేర్కొన్నారు. మృతదేహాన్ని హుజుర్‌నగర్ ఏరియా ఆస్పత్రి మార్చురీలో ఉంచినట్లు తెలిపారు.

నివాళి

మోత్కూరు, అక్టోబర్ 24 : మండలంలోని సదర్శాపురానికి చెందిన మాజీ సర్పంచ్ వర్రె భిక్షం సతీమణి నర్సమ్మ(76) మృతిచెందింది. మంగళవారం మృతదేహాన్ని నాగార్జున సాగర్ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్, ఆయిల్‌ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి, ఉమ్మడి రాష్ట్ర సమచార హక్కు చట్టం మాజీ ప్రధాన కమిషనర్ వర్రె వెంకటేశ్వర్లు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ వర్రె కవితాశ్రీనివాస్, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు దొండ నర్సయ్య, రైతు బంధు మండలాధ్యక్షుడు సోంమల్లు, నాయకులు పాల్గొన్నారు.

పిచ్చి కుక్క దాడిలో పది మందికి గాయాలు

మోత్కూరు, అక్టోబర్ 24 : మోత్కూరు మున్సిపాలిటీ కేంద్రంలో పిచ్చి కుక్క దాడి చేసి పలువురిని గాయపరిచింది. మంగళవారం పట్టణంలోని అంగడి బజార్‌లో ఆరుగురిపై అలాగే సుందరయ్య కాలనీలో మరో నలుగురు కుక్క దాడిలో గాయపడ్డట్లు కాలనీ వాసులు తెలిపారు. స్థానిక పీహెచ్‌సీలో బాధితులు చికిత్స పొందారు.